కథానిక

# వికృత పరివర్తన

"పుష్య"

తిరిగి తిరిగి నే నింటికొచ్చేసరికి, మా యింటి ముందు జనం గుమిగూడి వున్నారు. ఇంట్లోని వారంతా పేరయ్య చుట్టూ మూగి నువ్వు చేసిన పనికి అలా చేస్తాం, యిలా చేస్తాం! అని భయపెడుతున్నారు. నాన్నగారుకూడా రుద్ర రూపం దాల్చి 'నిజం చెప్పు. లేకపోతే నిన్ను పోలీసుల కప్పగిస్తా దొంగవెధవా' అని మీద పడి కొట్టినంత పని చేస్తున్నారు.

ఇది చూడగానే నాకెంతో ఆశ్చర్యంవేసింది. ఎందుచేత నంటారా, పేరయ్య చాలాకాలం నుంచీ మా యింట్లో నమ్మకంగా పనిచేస్తున్న బంట్రోతు. ఈవిధంగా వాణ్ణి అదమాయించటం నే నిదివర కెన్నడూ చూడలేదు. అందుచేత ముందుకొచ్చి 'ఏం జరిగిందేమిటి' అని అడిగాను.

దానిమీద నాన్నగారు నావేపు తిరిగి అన్నారు: 'ఏం జరుగుతుంది జరగవలసిం దేదో జరుగుతుంది. నే నొకటి చెబుతాను విను రాజా. నువ్వు కమ్యూనిస్టని నిన్ను పిలుచుకున్నా, సోషలిస్టని పిలుచుకున్నా నాకు లక్ష్యం లేదు. కాని నువ్వుమాత్రం పనివాళ్లతో జోస్తీగా వుండటం ఇహ కట్టిపెట్టేయాలి. పేరయ్య పూర్తిగా నీవల్లే పాడయ్యాడు. మొట్టమొదట వాళ్ళ పల్లెనుంచి వచ్చినపుడు ఎంత వినయంగా, ఎంత నమ్మకంగా వుండేవాడు. అలాంటిదిప్పుడు నోటినుంచి ఏదైనా మాట రాభయం. కుక్కలా మీద కలబడతాడు.'

ఆయన చెప్పినది నాకేమీ అర్థం కాలేదు. అడిగాను: 'ఇంతకూ వాడుచేసిన నేరం ఏమిటంటారు?'

'ఏమిటో వేరే చెప్పాలా. మొదట లేదు గాని యిప్పుడు దొంగతనమొకటి ఆరంభించాడు. పది నిముషాలింకా కాలేదు. నీభార్యది బంగారపు గొలుసు, బంగారపు వాచీ మాయమైపోయినాయి' అంది అమ్మ.

'అయితే నిర్ధారణేమిటమ్మా వాడే తీసేడని?'

'అయితే నిర్ధారణకూడా కావాలి' అంది నావేపు కోపంతో కన్నెర్రజేసి. 'నేనేదో అబద్ధమాడుతున్నట్టు! స్నానాల గదిలోంచి నీభార్య యింకా రానేలేదు. కాగులో నీళ్లు పోయడానికి పేరయ్య వెళ్లాడు గదిలోకి. స్నానాల గదిలో వదిలేసిన గొలుసు, వాచీ చూద్దుమా, ఎక్కడా కనబడదు. పోనీ యింకాగా అక్కడికింకెవరేనా వెళ్లారా అంటే అదీ లేదు. నువ్వే చెప్పునాయనా, ఇక పేరయ్య తీయకపోతే, యింకెవరు తీశారో!'

పేరయ్య దిక్కు చూశాను. నిలుచున్నాడు వణికిపోతూ. అతని నోటినుంచి మాటరావడం బ్రహ్మాండం అయిపోతోంది. అడిగాను:

'పేరయ్యా, గొలుసు, వాచీ చూసేవా?'

'లేదు బాబయ్యా, నేనే ఖర్మం యెరుగను నేనేగాని వాటిని చూస్తే నాకళ్లు పోతాయి. నిజంగా బాబూ, నేనే కాని అబద్ధమాడితే, నా నోరు పడిపోతుంది. నాకేం తెలీదు బాబూ! ఇంకా మీకు అనుమానమయితే, దేవుడు గుళ్లోని దీపం ఆర్పేస్తాను బాబయ్యా' అని గోలున ఏడ్చాడు.

పేరయ్యను చూస్తే నాకెంతో జాలేసింది. ఇంత కాలంనుంచీ ఎంతో నమ్మకంగా పని చేస్తున్న పేరయ్య యిలాంటి పని చేస్తాడా అని ఇంట్లోని ఒక్కరూ ఆలోచించలేదు. దొంగ అంటే దొంగ అన్నారు జరిగిందేదో జరిగి పోయిందని, నా కోటును తీసి, పేరయ్య చేతి కిచ్చి యింట్లో పడేయమన్నాను. మనిషి సగం క్రుంగిపోయి లోపల కెళ్లాడు. ఇంట్లోవాళ్లది చూసి విస్తుపోయారు.

ఆ మర్నాడు ఉదయాన్నే, బంగారపు గొలుసు, వాచీ, చేత్తో పట్టుకొని మా అమ్మ నా గదిలో కొచ్చింది. వాటిని నాముందర పెట్టి,

'చూడు నాయనా, ఇలాంటివేను నీ పెళ్లాం చేసే పనులన్నీను. తలగడా క్రింద పెట్టెని పెట్టుకొని ఇల్లంతా గోలచేసింది పోయేయని' అన్నాది.

'అంతేగాని వాడెంత బాధపడతాడో కొంచమైనా ఆలోచించారు గారు. అందుకే అడిగేను, యింట్లోకి రాగానే, పేరయ్య తీసినట్టు ఏదైనా నిర్ధారణ ఉందా అని. మనం యజమానులం గనుక, యింట్లో ఏమొచ్చినా పని వాళ్ళను, ఖచ్చితంగా నిలదీసి అడిగి, యింకా చాలకపోతే పోలీసువాళ్ళచేత చావగొట్టిస్తాం' అనేసరికి అమ్మ నిశ్చేష్టురాలయి పోయింది. ఎంతో నొచ్చుకొని 'ఇలా జరుగుతుందని నేనేం కలకనగలనా! నీ భార్య ఏం చెప్పిందో అదే నేను చెప్పానుగాని' అన్నాది.

'అంతేగాని నువ్వేమీ ఆలోచించ నక్కర లేదన్నమాట. అయిందేదో అయిపోయింది. పేరయ్యను క్షమాపణ వేడుకోండి.'

'ఆ వెధవకు క్షమాపణోటా, చాలు, చాలు' అని ఏమో సణుగుకుంటూ, లోపలికి వెళ్ళి పోయింది.

కొన్ని నిముషాల తరువాత, పేరయ్య, ఎగపోస్తున్న చిన్నాడిని ఎత్తుకుని, రెండవ చేతిలో మందు పట్టుకుని, ఆస్పత్రినుంచి తిరిగొచ్చాడు. డాక్టరుగారు మందు మార్చలేదనీ, యీ మందే మరి నాలుగురోజులు యిస్తారనీ చెప్పాడు. చిన్నాడిని వొళ్ళో కూర్చోపెట్టుకున్నాను. పేరయ్య కొంచం దూరంలో నిలబడి, నేలవేపు చూస్తూ అన్నాడు:

'బాబూ, తమతో మనవి చేసుకుందామని వచ్చాను.'

'చెప్పు, అదేఁటో' అన్నాను ఆశ్చర్యంతో.

'చూడండి, బాబయ్యా, మా వూరివాడే చలమయ్య, ఇక్కడున్నాడు. అతని దగ్గర నాసొమ్ము కొంత వుంది. అంచాత, ఆ పోయిన వస్తువులకు సరిపోయిన సొమ్మేనా తీసుకోండి. లేకపోతే ఆసొమ్ముతో వస్తువులను కొనేసి అమ్మగారి కిచ్చేయండి. మరి, నాకు సెలవిప్పించండి బాబూ, మా వూరు పోతాను' అన్నాడు రుద్ధకంఠంతో.

హతాశుడనైపోయేను. పేరయ్య యిలా అంటాడని కలలో కూడా అనుకోలేదు. నిజమే కూడాను. అన్యాయంగా అతనిమీద నింద మోపినందుకు, అతని హృదయం ఎంత గాయపడి వుండకపోతే యిలా అంటాడు. మా యిల్లు వదలి వెళ్ళిపోవడం, నాకెంతమాత్రం యిష్టం లేదు.

'పేరయ్యా, నీకేం మతిపోయిందా? ఇదంతా ఏఁవిటి! మొదటే చెప్పానుగా నేను, నీమీద నాకెటువంటి అనుమానం లేదని. జరిగినదంతా మర్చిపో. పోయిన వస్తువులుకూడా దొరికాయి. తలగడాక్రింద పెట్టి మర్చిపోయింది నాభార్య.'

పేరయ్య అలాగే నిలబడ్డాడు. కదలి వెళ్ళలేదు.

'లేదండి బాబయ్యా, ఇది నా జన్మలో మరిచిపోలేను. ఆపోయిన వస్తువులు దొరక్కపోయినా, ఆ నింద నామీద వేసేవారే మీరు. ఇన్ని సంవత్సరాలూ నా స్వంతయిల్లులా చూసుకున్నాను. అయినా మీరు నన్ను దొంగా, దొసుకూ, అంటే, మీ పంచకింద వుండటం ఏమంత శ్రేయస్కరం కాదు. నేనెన్నడూ అనుకోలేదు, నాశీలాన్ని మీరిలా శంకిస్తారని. ఏం చేస్తాను బాబూ, అదంతా నాఖర్మ. పోయిన సరుకులు దొరికాయి. అంతే కావాలి. ఇక నిశ్చయంగా పోవచ్చు నేను.'

కొంతసేపటివరకూ ఏంచేయాలో తెలిసింది కాదు. పొట్టచీలిస్తే అక్షరంలేని యీ పేరయ్య యిలా అనగానే నాకెంతో ఆశ్చర్యంవేసింది. నిజానికి అతను చెప్పినది కూడా సత్యమే. మా యిల్లు వదిలిపెట్టి పోతానంటూంటే, నా శరీరంలోంచి ఒక భాగం తీసేస్తున్నట్టనిపించింది.

'ఆమాటలన్నీ కట్టిపెట్టి, తిన్నగా వెళ్ళి నీ పనేదో ఇంట్లో చూసుకో.' అన్నాను అధికార స్వరంతో. దానికేనా లొంగుతాడేమోనని.

'వద్దు బాబూ, ఇక యీ యింట్లో పేరయ్య ఒక నిముషమైనా నిలువలేడు. నన్నొదిలేయండి.'

'నిన్ను వెళ్ళనియ్యకపోతే.'

'మీరేది చెప్పినా వింటానుగాని, యీ యింట్లో మట్టుకు పనిచేయలేను.'

'అయితే, నన్ను కూడా లక్ష్యపెట్టవన్న మాట.'

'లేదు బాబయ్యా, క్షమించండి.'

'పేరయ్యా, నీలో యీ మార్పెలా వచ్చిందో తెలియకుండా వుంది.'

'నాకర్మ ఎలావుంటే అలా వెళ్లనియ్యండి బాబూ' అంటూ నా పాదాలు స్పృశించాడు. నా ఒళ్లో వున్న పాపాయి ముఖాన్ని ఎంతో ఆప్యాయంగా చూస్తూ వెళ్లిపోయాడు. తిరిగి పిలుద్దామనుకున్నాను. కాని నోరు రాలేదు. అన్యాయంగా వాడిమీద నింద మోపినందుకు ఒక పాఠాన్ని నేర్పాడు. అశ్రుపూర్ణాలయ్యాయి నా కళ్లు. అతడు చేసిన పనికూడా తప్పుకాదని అంతరాత్మ ప్రబోధించింది.

* * *

కాలచక్రం గిర్రున తిరిగిపోయింది. పేరయ్యను చూడలేదు. అతని గురించి కూడా ఏమీ వినలేదు. ఇంతకూ అంత అవసరం కూడా లేక పోయింది.

ఒకనాడు అకస్మాత్తుగా కొత్తబట్టలతో మా గుమ్మం ముందు కనిపించాడు. అతని దగ్గర లెక్కలేనన్ని ఆటవస్తువులు, మిఠాయివున్నాయి. పిల్లలందరకూ పంచుతున్నాడు.

'పేరయ్యా, ఎంతలాగ మారిపోయావు?' అని లేని చిరునవ్వు తెచ్చుకొని అనగానే—

నిలుచొని 'బాబూ, కులాసాగా ఉన్నారా? చాలా కాలమయింది మిమ్మల్ని చూసి. ఎప్పుడు వద్దామనుకున్నా శెలవు దొరికేది కాదు.'

'ఎక్కడవున్నా పని చేస్తున్నావా?'

'హరిపురం మిల్లులో పని చేస్తున్నానండి. జీతం ఇవ్వడమన్నా, శెలవు యివ్వడమన్నా ప్రాణం పోతుంది వాళ్లకు. పోనీ మిల్లుకు లాభాలు రాలేదా అంటే అధికంగా వస్తున్నాయెను. అయినా వాళ్ళపని మాత్రం మానరు, వీళ్ళ డబ్బు ఘన్నుగాను.'

నాకు నవ్వొచ్చింది.

'అప్పుడే ధనికవర్గాన్ని తిడుతున్నావన్న మాట' అన్నాను.

'ఏం చెప్పేది బాబూ, ఈ వ్యాపారంలో ప్రతి చిన్న విషయంలోనూ మోసమే. మిల్లు అధికారుల దురంతాలను వేలెత్తిచూపి, ఫిర్యాదు చేస్తే, ఆ ప్రభుత్వోద్యోగులూ అలాగే ఉన్నారు. ఎక్కడ చూసినా లంచం, మోసం తప్ప యింకేమీ కనిపించటం లేదు.'

'నీ కెంత జీతం?'

'ముప్పై ఎనిమిది రూపాయిలు జీతం. పది హేడు రూపాయలు కరువు బత్తెం. కాని జీతం నలభైయున్నా కరువు బత్తెం ఇరవై ఐదున్నా యివ్వకపోతే సమ్మె చేస్తామని వాళ్ళని భయ పెడుతోంది మా సంఘం.'

'అయితే మిల్లు ప్రొప్రయిటర్లేమంటారు?'

'ఏమంటారు బాబూ! నష్టమొస్తోంది. మీ రడిగినట్లు మే మియ్యలేమంటున్నారు. కాని వాళ్ల ఏజెంట్లద్వారా కబురంపుతున్నారు. మాసంఘం కాని విడిపోతే జీతాలెచ్చు చేస్తామని. చూసేరా! ఎలాంటి ఎత్తు ఎత్తారో!'

మా యిల్లు వదిలేసిన దగ్గరనుంచీ పేరయ్య పూర్తిగా మారిపోయాడు. పూర్వంలాగ నూని జిడ్డోడుతూ, మోకాలు దిగని కట్టుపంచ, మీద చింకి తువ్వాలు లేవు. ఇప్పుడు తలకు వాసన నూనె. వేళ్లమధ్య సిగరెట్టు. చేతికి రిష్టువాచీ. నోటిలో కిళ్లీ. ఒకటో రకం మిల్లు బట్టలూ, కాలికి జోడు. అప్పుడప్పుడు బ్రాందీ కూడా రుచి చూస్తూ ఉంటాడట. నిజంగా సహవాసం మనిషిలో మార్పును ఎంతైనా తేగలదు. ఆరోజు పేరయ్య చాలా సేపటివరకూ మా యింటోనే వుండి సాయంత్రం కాగానే వెళ్లిపోయాడు. కారణం తెలియదు. అతనిని చూసేను గదా అని నాకు కూడా ఏమంత ఉల్లాసంగా లేదు.

* * *

ఒకనాడు పేరయ్య దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. కార్మికుల సమ్మెలో ప్రధాన పాత్ర తీసికొనినందుకు, కొంతమందితో సహా తనను మిల్లు యజమాని పనినుండి తొలగించాడనీ, ఏదైనా పని యిప్పించమనీ ఉంది. మిల్లులో యిచ్చినంత జీతం యివ్వలేననీ, పూర్వం మా యింట్లో ఇచ్చినంత యిస్తాననీ జవాబు వ్రాశాను. తిరిగి ఉత్తరం రాలేదు. కొంత కాలంనుంచీ ఆ సంగతే మర్చిపోయాను.

ఎన్నో రోజులు కాలేదు. పట్నంలో పేరయ్యను చూసేనని, ఒక లక్షాధికారి యింట్లో పనిచేస్తున్నాడని మా బంట్రోతు వెంకన్న

చెప్పాడు. ఏదో పని దొరికింది గదా అని సంతోషించాను. కాని నన్ను ఏమాత్రం లెక్క చేయలేదుకదా అని కోపం తెచ్చుకున్నాను.

ఒకనాడు మా అబ్బాయొచ్చి, పేరయ్య ఒచ్చేడని చెప్పి యిలా అన్నాడు.

'నాన్నా! నీకు తెలుసో లేదో, పేరయ్య ముగ్గురు తురకాళ్లను చంపేశాడు.'

నేనేదో చెప్పబోయాను. కాని యీ మధ్యలో—

'నాన్నా! నువ్వెందరు తురకలని చంపేవు? నేను మాత్రం ఒకణ్ణయినా చంపుతాను ఏం?' అన్నాడు.

నేను విస్తుపోయాను. ఎంచాతనంటే, ఒక్క కృటిలో కమ్యూనలిజం పసి హృదయాలలో ఎలా నాటుకుపోతోందో చెప్పేశాడు. వెంటనే అడిగాను:

'నన్ను చంపుతావా?'

చంపనన్నట్టు తల వూపాడు భయంతో. మళ్లా అడిగాను.

'నన్నెందుకు చంపవు?'

'నువ్వు మా నాన్నవు గనక.'

'అయితే తురకలు నీకేమి అపకారం చేశారు?'

'వాళ్లు హిందువులను చంపేస్తున్నారు.'

'వాళ్లు నీకేమైనా హాని చేశారా అని అడుగుతున్నాను.'

'లేదు.'

'అయితే నువ్వెందుకు చంపుతావు వాళ్లను?'

'నాకేం తెలుసు? ప్రతి హిందువుడూ కనీసం ఒక్క తురకాణ్ణయినా చంపి తీరాలి, అని పేరయ్య చెబితే నేను నీతో చెబుతున్నాను. అంచేత, నేనొక్క తురకనైనా చంపి తీరుతాను' అని చెబుతూ గది అవతలకి పారిపోయాడు. వాడి వెనకాలే నేనుకూడా వెళ్లేను. మా అమ్మ, పిల్లలందరూ ఒక దగ్గర కూర్చున్నారు. వాళ్ల కెదురుగా పేరయ్య కూర్చొని ఏదో చెబుతున్నాడు.

'అమ్మా! మొదట్లో యిలాంటి పనులు చేయటానికి భయమేసేది, చేతులుకూడా వణికేవి. కాని యిప్పుడు పరిపాటైపోయింది.'

చేపాటి కఱ్ఱంత యినుప గునపాం, ఒక పెద్ద కత్తి, పేరయ్య ముందున్నాయి. అమ్మ భయపడుతోంది.

'అయితే పేరయ్యా, యిలా చేయడం నీకేమయినా బావుందీ?'

'ఏంటమ్మా! అలా అంటారు మీరు ధనవంతులు. మీకేం భయంలేదు. కాని, రోజూ అకరుకు తురకలు ఎంతమంది అమాయక హిందువులను చంపేస్తున్నారో మీకేం తెలుసమ్మా? వాళ్లు ఆస్తి పాస్తులన్నీ లూటీ చేస్తున్నారు. ఇళ్లు తగలబెడుతున్నారు. పిల్లలను నరికేస్తున్నారు.'

'అవును. నేనుకూడా విన్నాను. పూర్తిగా తెలీదు. ఎంచాతంటే యిన్నాళ్లూ, హిందువులూ, తురకలూ, అన్నదమ్ముల్లాగున్నారు.'

అన్నట్టు, 'మరచిపోయేనమ్మా, ఏదీ నేను అడిగింది?

అమ్మ కొంచెంసేపాలోచించి. పది రూపాయిలిమ్మని కోడలితో చెప్పింది. అంతకన్న ఎక్కువ యివ్వలేనని పేరయ్యతో చెబుతూండగా నేను ముందుకెళ్ళి,

'అలాంటి వెధవ పనికి, పది రూపాయలిమ్మంటున్నావు దమ్మిడీకూడా యివ్వొద్దు. నువ్వు ఉదయాన్నే లేచి ప్రార్థించేది అమాయక ప్రజను చంపేయమనేనా?'

ఎవరూ కిక్కురుమనలేదు. పేరయ్య అందుకున్నాడు.

'అయితే బాబూ, ఆ తురకలెందుకు అమాయిక హిందువులను చంపుతున్నారు?'

'స్వయంరక్షణ చేసుకోలేనివారు చావుకర్హులు. ఎంతకాలం నీలాంటి ద్రవ్యాశాపిశాచులు వాళ్లను రక్షిస్తారు? ఇవాళ యీ పని చేస్తావు. రేపు నీ మతస్థులనే చంపుకుంటావు. కమ్యూనలిజాన్ని నిర్మూలించాలంటే, ఇది కాదు సరియైన మార్గం. తక్షణం వెళ్లు యిక్కడనుంచి. ఇటుపైన మా యింట్లో కాలు పెట్టకు' అని కసిరేశాను.

పేరయ్య తన కత్తీ, గునపాం తీసికొని, అమ్మ కాళ్లకు మొక్కి, వెళ్లిపోయాడు. మళ్లీ యీనాటివరకూ పేరయ్య కనుపించలేదు.